బి. శ్రీవల్లీ రాధిక

# బలహీనత

"సా..ర్! మృదులా మేడమ్ మీద యాసిడ్ పోశారు సార్... మృదులా మేడమ్ మీద యాసిడ్ పోశారు సా..ర్!!"

ఫోన్ పెట్టేశాక కూడా అవే మాటలు చెవుల్లో మార్మోగుతున్నాయి.

"మృదుల.." ఎంత అందమయిన రూపం! వెన్నెల జల్లు లాంటి అందం. ఆమెని చూస్తే చాలు.. మనసు మీద పూలవర్షం కురిసినట్లవుతుంది.

ఆ చల్లటి నవ్వు.. హుందాగా వుండే నడక.. ఆ పెద్ద పెద్ద కళ్ళూ..

భగవంతుడా! అవన్నీ ఎంత దారుణంగా మారి వుంటాయో యిపుడు! యాసిడ్ మంటలకు ఎంత హృదయవిదారకమయిన వంపులు తిరిగి వుంటాయో!

తల్చుకోవడానికి కూడా నాకు భయం వేస్తోంది. ఇదంతా నా వలనే జరిగిందన్న నిజం నన్ను మరీ బాధిస్తోంది.

అవును. ఇదంతా నా వల్లే జరిగింది.

నేను ఈ కాలేజికి ప్రిన్సిపాల్‌ని అయ్యి అయిదు సంవత్సరాలు అయింది. అంతకు ముందు లెక్చరర్‌గా మరెన్నో ఏళ్ళ అనుభవం వుంది. స్టూడెంట్స్‌లో ప్రతి ఒక్కడి నాడీ నాకు తెలుసు. ఏమాటకి ఎవరు ఎలా రియాక్ట్ అవుతారో నాకు తెలుసు. అలాంటి నేను.. యిలా లీవ్ తీసుకుని వెళ్ళకపోయుంటే.. ముక్కు పచ్చలారని ఈ పిల్ల మీద.. నిన్న గాక మొన్న ఉద్యోగంలో చేరిన అమ్మాయిమీద .. యింతటి అనర్థం జరిగేది కాదు.

ప్రతిసారీ ఎగ్జామ్స్ టైంలో నేను చాలా జాగ్రత్తగా వుంటాను. కాపీలు కొట్టకుండా స్టూడెంట్స్‌ని కట్టడి చేయడం జరిగే పని కాదని నాకు తెలుసు. అలా చేయడం వల్ల ప్రయోజనమూ లేదు.

నేను చాలా రోజుల క్రితమే నిర్ణయించుకున్నాను. "ఎందుకు! ఎంట్రన్స్ టెస్టులు, కాలేజీల్లో సీట్లు.. ఉద్యోగాలు.. లంచాలు.. రికమండేషన్లు.., ప్రతిదీ అస్తవ్యస్తంగా మారిపోయాక యిక పరీక్షలలో కాపీలు కొట్టకుండా అడ్డుపడడం మాత్రం ఎందుకు! అది కూడా మాప్రాణాలు రిస్క్‌లో పెట్టుకుని! ఎవడి ఖర్మానికి వాడే పోతాడు."

కాలేజ్‌లో మిగతా లెక్చరర్స్ అందరిదీ కూడా యిదే మనస్తత్వం.

అందుకే పరీక్షలు జరిగేటపుడు వాళ్ళు అన్నిటినీ చూసి కూడా చూడనట్లుగా వదిలేస్తుంటారు. నా డిగ్నిటీకి లోపం రాకుండా వుండేందుకు.. నేనసలు వాటిని చూడనే చూడను. కానీ ఈసారి..

కారు రయ్యిన హాస్పిటల్ వైపు పరుగెడుతోంది. నా గుండె కూడా అంత వేగంగానూ కొట్టుకుంటోంది. ఎలాంటి దృశ్యం చూడాలో అన్న ఆలోచన గుండెల్లో దడ పుట్టిస్తోంది.

ఈసారి.. సరిగ్గా ఎగ్జామ్స్ టైమ్‌కి నాకు అత్యవసరమయిన పని తగిలింది. అత్యవసరం!! నిజంగా అది అంత అవసరమా! .. కాదు.. నా మనసుకు తెలుసు.

ఇపుడు అంత అర్జంటుగా వూరికి వెళ్ళాల్సిన అవసరం లేదు. అమ్మ అనారోగ్యమూ.. ఆవిడ తనని రమ్మంటూ ఉత్తరాలు వ్రాయడమూ.. ఇదంతా ఎప్పటినుంచో వున్నదే. కానీ మేనేజ్‌మెంట్‌తో చెప్పేందుకు యిపుడు అది ఒక మంచి కారణం అయింది.

ఎందుకలా చేశాను నేను! పరీక్షల బాధ్యతంతా వైస్ ప్రిన్సిపాల్ సుందరరామయ్య మీద వదిలేసి.. అంత బాధ్యత లేకుండా అలా ఎందుకు వెళ్ళాను! నిర్లక్ష్యం.. కేవలం నిర్లక్ష్యం.

అలా చేయకుండా వుండవలసింది నేను. సుందర్రామయ్య కూడా అంత అనుభవం లేని వాడే.

కారు హాస్పిటల్‌లో ప్రవేశిస్తుంటే వెల్లువలా కనిపించారు జనం. హాస్పిటల్ నిండా మాకాలేజ్ స్టూడెంట్స్. కొంచెం సెన్సిటివ్‌గా వుండే అమ్మాయిలు బాగా ఏడ్చినట్లున్నారు. మొహాలు.. ముక్కులూ ఎర్రగా కంది వున్నాయి. మగపిల్లలందరూ గుంపులు గుంపులుగా నిలబడి మాట్లాడుకుంటున్నారు.

నాకు ఒక్కక్షణం కారు దిగేందుకు భయం వేసింది. ఎటువైపునుంచి ఎవడు వచ్చి కాలర్ పట్టుకుంటాడో! "ఎందుకిలా చేశారు! అసలు మీరు సెలవెందుకు పెట్టారు!" అంటూ గర్జిస్తారో! అనిపించింది.

వాళ్ళకి మృదుల మీద ఎంతటి వెర్రి అభిమానముందో నాకు తెలుసు. మా కాలేజ్ స్టూడెంట్స్‌లో ఏ ఒక్కడు కాలేజ్‌లో వున్నా మృదుల మీద అలాంటి అటాక్ జరగనిచ్చేవాళ్ళు కాదు.

వీళ్ళు మరో కాలేజ్‌లో ఎగ్జామ్స్ రాసేందుకు వెళ్ళడం.. వేరే కాలేజ్ పిల్లలు మా కాలేజ్‌లో ఎగ్జామ్స్ రాసేందుకు రావడం..

అసలు యింతకీ మృదుల ఎలా వుందో! నేను కారు దిగుతుంటే అందరూ గబగబా ఎదురు వచ్చారు.

"ఏమిటి రాజేష్! మేడమ్ ఎలా వున్నారు?" అన్నాను.

".. ఫర్లేదు సర్. మేము భయపడినంతగా కాలలేదు. ఒకడు యాసిడ్ మొహం మీద చల్లబోయాడుట. కానీ లాస్ట్ మినిట్‌లో మరో అతను దాన్ని లాగేయడంతో అది భుజం మీద వొలికింది. చేయి, మెడ కొంచెం కాలాయి. అంతే."

ఆమాటలు విన్నాక కొంచెం స్థిమితపడ్డాను. స్టూడెంట్స్ అందరూ అంత కామ్‌గా ఎందుకు వున్నారో అప్పుడు అర్థం అయింది. అమ్మాయిలకి మాత్రం యింకా కళ్ళల్లో నీళ్ళు తిరుగుతూనే వున్నాయి.

ఒక్కక్షణం నాకు ఈర్ష్యగా అనిపించింది. ఉద్యోగంలో చేరి రెండు సంవత్సరాలు కాలేదు. అప్పుడే ఎంత అభిమానం సంపాదించుకుంది ఈ పిల్ల!

"అందుకేగా ఆ అమ్మాయి మీద అంత కక్ష పెంచుకున్నావ్!" అంతరాత్మ కొట్టినట్లుగా అడిగింది. నేను ఉలిక్కిపడ్డాను. కక్షా! మృదుల మీద నాకు కక్షా..!

అవును. కక్ష కాకపోయినా ఒక రకమయిన అసంతృప్తి..

"ఆ అమ్మాయి పిల్లలందరినీ అయస్కాంతంలా ఆకర్షించింది. కాలేజ్‌కి ప్రిన్సిపాల్‌వి నువ్వైనా స్టూడెంట్స్ అందరికీ ఆమె మాటే వేదవాక్కుగా వుంది. నీ వయసుకీ, అనుభవానికీ తగ్గ గుర్తింపు దొరకకపోవడంతో నీకు కడుపుమంటగా వుంది, అవునా!" అంతరాత్మ రెట్టించింది.

అవును. నాకు బాధగానే వుండేది. కానీ ఏం చేస్తాను! పిల్లలందరినీ ఆమె బాగా ఆకట్టుకుంది. అందుకే అపుడు నేను మాట్లాడకుండా వూరుకున్నాను. కానీ యిప్పుడు.. యిప్పుడు నాకు అవకాశం వచ్చింది.

లెక్చరర్ వుద్యోగం అంటే కేవలం అందంతో, మాటలతో ఆకట్టుకోవడం కాదు. దానికి బోలెడంత చాతుర్యం వుండాలి. ఎవరితో ఎలా మాట్లాడాలో.. ఎప్పుడు ఎలా ప్రవర్తించాలో తెలియాలి. లేకపోతే యిలాగే చావు తప్పి కన్ను లొట్టబోయినట్లవుతుంది.

ఇన్నేళ్ళు ఉద్యోగం చేశాను. నేను ఎపుడైనా యిలాంటి పరిస్థితి ఎదుర్కొన్నానా! అదే అర్థం కావాలి ఆ అమ్మాయికి. ఆ విషయమే ఆ అమ్మాయికి బాగా తెలిసేలా చేయాలి.

అవును, అసలు ఎలా పలకరించాలో ఆ అమ్మాయిని! ఏం చెప్పాలి ఆ అమ్మాయితో! హాస్పిటల్ కారిడార్‌లో నడుస్తూ గబగబా ఆలోచించసాగాను.

"ఆ కాలేజ్ స్టూడెంట్స్ రౌడీలు. వాళ్ళంతే." అని చెప్పకూడదు. "అయితే ఆ విషయం తెలిసే మీరు యిలా లీవ్ తీసుకున్నారా సర్!" అంటుంది. అఖండురాలు.

వాళ్ళు ఎలాంటి వాళ్ళైనా మనం హాండిల్ చేసే విధానం సరిగా వుంటే యిదో పెద్ద ప్రాబ్లం కాదు అని చెప్పాలి. అవును. అలాగే చెప్పాలి. ఇదే నేనైతే అసలు యిలాంటి పరిస్థితి రానిచ్చే వాడినే కాదు, అని చెప్పాలి. నేను చెప్పడం కాదు. ఆఅమ్మాయి చేతే అనిపించాలి.

తీర్మానించుకుంటూ రూమ్‌లోకి నడిచాను.

మంచం మీద పడుకుని వుంది మృదుల. సుందర్రామయ్య, మిగతా లెక్చరర్స్.. అందరూ అక్కడే వున్నారు. ఎంతయినా మళ్ళీ ఆ అమ్మాయిని అలా చూస్తుంటే బాధగా అనిపించింది.

కాకపోతే పెద్దగా ప్రమాదమేమీ జరగలేదు. ఏ కళ్ళ మీదైనా పడితే యింకేముందసలు! ఆ వూహకే వళ్ళు జలదరిస్తుంటే దగ్గరగా వెళ్ళి కుర్చీలో కూర్చున్నాను.

"ఎలా వుందమ్మా!" అన్నాను మృదులతో.

"అసలు ఏం జరిగింది!" అన్నాను అందరివైపూ చూస్తూ.

ప్యూన్ సాయిలు చెప్పసాగాడు. ఆ సంఘటన మళ్ళీ గుర్తు చేసుకుంటున్నట్లూ మృదుల కళ్ళు విచ్చుకున్నాయి.

*****

ఆరోజు...

తొమ్మిది గంటలకి మామూలుగా ఎగ్జామ్ మొదలయింది. మృదుల, కళ్యాణి ఎగ్జామినేషన్ హాల్లో వున్నారు.

పిల్లలందరికీ క్వశ్చన్ పేపర్స్ యిచ్చేశారు. రూమ్‌కి ఒక చివర కళ్యాణి, మరో చివర మృదులా నిలుచుని వున్నారు. ఒక గంట నిశ్శబ్దంగా ఎగ్జామ్ జరిగింది. అప్పుడు.. సాయిలు మెల్లగా వచ్చి తలుపు దగ్గర నిలబడ్డాడు.

"అమ్మా! సుందర్రామయ్య సార్ రమ్మంటున్నరు."

మృదుల తిరిగి చూసింది. " ఎవర్ని!"

"మిమ్మల్నేనమ్మా!"

"ఎందుకు!" అడుగుతూనే బయటకి వచ్చింది.

సాయిలు ముందు నడిచాడు. ఒక క్లాస్‌రూం దగ్గర ఆగి, గబగబా నడుస్తున్న మృదులని ఆపి, "ఈ రూంలో వున్నారమ్మా!" అన్నాడు.

మృదుల లోపలికి నడిచింది. అంతే. మరుక్షణం తలుపు మూసుకుంది.

అక్కడ.. ఎదురుగా బల్ల మీద నలుగురు మగపిల్లలు కూర్చుని వున్నారు. ప్రక్కన మరో ముగ్గురు నిల్చుని వున్నారు.

పిల్లలు..!

వాళ్ళ పొడుగూ, లావూ.. నిలుచున్న తీరూ.. ధోరణీ చూస్తే.. పిల్లలు అనేలా లేరు. రౌడీల్లా వున్నారు.

అనుభవమూ, విజ్ఞానమూ కనబడని మనుషుల మొహంలో ఆవేశం.. వళ్ళు జలదరింపజేస్తుంది. పిచ్చివాడి చేతిలో రాయిలా భయపెడ్తుంది.

కానీ వాళ్ళలో ఆవేశం కూడా లేదు. అందరూ నవ్వు మొహాలతోనే వున్నారు.

మృదుల తలుపు వైపు పరుగెడుతుంటే ఒకడు వచ్చి అడ్డంగా నిలబడ్డాడు.

మాటా లేదు. మంతీ లేదు. చిరునవ్వుతో చూస్తూ నిలుచున్నాడు. అంతే.

"ఏమిటిది! ఎవరు మీరు! తలుపు తీయండి!" మృదుల అరిచింది. ఆమె అరుపులు వినబడనట్లే చూశారు వాళ్ళు.

అప్పటికి విషయం అర్థమయిన సాయిలు తలుపులు బాదుతూ అరుస్తున్నాడు. "ఏంది బాబూ! తలుపు తీయండి. తలుపెందుకు ఏసిన్రు బాబూ! తలుపు తీయండి." అంటూ.

"ఆ ప్యూన్‌గాడిని అరవద్దని చెప్పరా!" వాళ్ళలో లీడర్‌లా వున్నతను కసురుకున్నాడు.

మృదుల వైపు తిరిగి "కూర్చోండి మేడమ్!" అన్నాడు మర్యాదగా.
మరొక అతను క్వశ్చన్ పేపర్ మృదుల ముందుకు జరిపాడు. "కాస్త ఆన్సర్స్ రాసి పెట్టండి మేడం."
మృదుల ఆ పేపర్ వైపూ, వాళ్ళ వైపూ మార్చి మార్చి చూసింది.
"ఏమిటిది!"
"ఇంగ్లీష్ కొశ్చన్ పేపర్ మేడమ్. లోన ఎగ్జామ్ నడుస్త లేదా! గా పేపర్."
"అసలు ఎవరు మీరు! స్టూడెంట్సేనా!" తడారిపోతున్న గొంతుతో అడిగింది మృదుల.
"లే మేడమ్. మా కొరకు గాదు. లోన దోస్తులున్నారు. గాళ్ళ కొరకు."
అదే విశాలమయిన నవ్వుతో సమాధానం చెప్పాడు వాడు. వాడి జేబులోనుంచి తొంగి చూస్తున్న సైకిల్ చెయిన్ మాత్రం వాడంత అమాయకంగా లేదు.
సకలమైన సామాగ్రీ కనిపిస్తోంది వాళ్ళ దగ్గర. ఒకడి చేతిలో చిన్న చాకు లాంటిది వుంది. దానితో ఆడుకుంటున్నాడు వాడు.
మృదుల కళ్ళు చిట్లించి చూసింది. ఏమిటసలు.. అది! కత్తేనా! మనుషుల్ని చంపొచ్చా దాంతో!.. లేకపోతే వూరికే పళ్ళు కోసుకోవడానికి పనికి వచ్చేదా!
వీళ్ళు తనని భయపెట్టడానికి అవన్నీ తీసుకొచ్చారా! లేకపోతే నిజంగా.. వాటిని వుపయోగించడం వీళ్ళకి తెలుసా!
మృదులకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.
క్వశ్చన్ పేపర్ వైపు చూస్తూ చెప్పింది. ".. నేను .. ఫస్టియర్ యింగ్లీష్ తీస్కుంటాను. ఇది సెకండ్ యియర్ పేపర్. నాకేం తెలీదు."
వాళ్ళు నవ్వారు. "జల్ది రాసియ్యి మేడమ్" అన్నారు.
ఏం చేయాలో.. వాళ్ళని ఎలా నమ్మించాలో అర్థం కాక మృదుల నిస్పృహగా తల విదిలించింది.

*****

చూసింది చూసినట్లూ చెప్తున్నాడు సాయిలు. "నేనొస్తా వుంటే వాళ్ళు పిలిచిండ్రు సార్. "ఆ అమ్మని పిలు. సుందర్రామయ్య సార్ పిలుస్తున్నడు" అన్నరు. నిజమనుకొన్నా. అసలు సుందర్రామయ్య సార్ అక్కడ లేడని నాకు తెల్వదు సార్. ఆళ్ళు యింత మోసం చేస్తరని నాకు తెల్వదు సార్..."

వాడిని మధ్యలో అడ్డుకున్నాను నేను. మృదుల వైపు తిరిగి అన్నాను. వద్దనుకున్నా నా కంఠంలో అహం ధ్వనించింది.

"ఈ ఉద్యోగంలోకి వచ్చాక యిలాంటి వాటన్నిటినీ ఎదుర్కోవడం తెలియాలమ్మా. వాళ్ళని చూసి కంగారుపడీ.. భయపడీ.. అరిస్తే వాళ్ళు మరీ రెచ్చిపోతారు. మనం వాళ్ళను చూసి భయపడుతున్నాం అని వాళ్ళకి అనిపించిందా.. యిక అంతే. వాళ్ళకి పిచ్చి వచ్చేస్తుంది. ఇక వాళ్ళ అల్లరిని భరించడం అసాధ్యం" స్టూడెంట్స్ గురించి నా విశ్లేషణ అంతా చెప్పసాగాను.

మృదుల తల అడ్డంగా వూపింది. మెల్లగా నోరు విప్పింది.

"నేనేమీ కంగారు పడలేదు సర్. నేను ఫస్ట్ యియర్ ఇంగ్లీష్ తీసుకుంటాను. అది సెకండ్ ఇయర్ పేపర్. నాకేమీ రాదు. అని చెప్పాను. అదే మాట చెప్పాను."

"అయినా ఏసిడ్ పోశారా!"

"లేదు సర్. నేను చాలాసేపు అదేమాట చెప్పడంతో వాళ్ళు ఆలోచనలో పడ్డారు. వెనక్కి తిరిగి వెళ్ళిపోబోయారు కూడా.."

"మరి..!!"

ఆ అమ్మాయి కళ్ళు సంకోచంతో రెపరెపలాడాయి. చెప్పనా, వద్దా అన్నట్లు ఒక్కక్షణం తటపటాయించింది.

"కా..నీ.. నేను వాళ్ళని వెనక్కి పిల్చాను సర్"

"ఎందుకు!" నాకర్థం కాలేదు ఆ అమ్మాయి ఏం చెపుతూందో!

"వెనక్కి పిలిచి..నాకు ఆ పేపర్ ఆన్సర్ చేయడం తెలీదు, కానీ ఒకవేళ తెలిసినా నేను చేయను.. అని చెప్పాను."

"ఏమిటీ!?"

"అవును సర్. ఆ మాట చెప్పకుండా వుండడం నా వల్ల కాలేదు." ఆమె తనలో తను మననం చేసుకుంటున్నట్లూ చెప్పసాగింది.

"..నన్ను అలాగే వదిలేసి అతను తలుపు తీయడానికి వెళ్ళాడు. అతని ప్రక్కన నిల్చున్న యిద్దరూ అతనితోపాటే వెనుతిరిగారు.. కూర్చున్న నలుగురూ కూడా ఒకసారి నావైపు ఎగాదిగా చూసి చిన్నగా నిట్టూర్చి లేచి నిలబడ్డారు.

ఇంకొక్క క్షణం అయితే వాళ్ళు తలుపు తీసుకుని బయటకు వెళ్ళిపోయేవారు. నేనూ వాళ్ళ వెనకే వచ్చేసేదాన్ని. కానీ ఆ ఒక్కక్షణంలో.. ఆ ఒక్క క్షణంలో.. ఆమాట చెప్పకుండా నేను వుండలేకపోయాను. అప్పుడు ఆ మాట చెప్పకపోతే యిక ఆ తర్వాత నేను బ్రతికి వుండడం వ్యర్థం అనిపించింది. అవును సర్. ఆ మాట చెప్తే వాళ్ళు రెచ్చిపోతారు. ఆతర్వాత వాళ్ళు ఏమైనా చేయచ్చు, అని నాకు తెలుసు. కానీ ఒకమాట చెప్పే స్వతంత్రం కూడా లేకపోయాక యిక బ్రతుకెందుకు! అనిపించింది.

అకారణంగా రోజూ ఎంతమంది చనిపోవడం లేదు! భూకంపాల్లో.. యాక్సిడెంట్లలో ఎంతోమంది అమాయకులు చచ్చిపోతుంటే..

నేను నా మనసుకు ఆనందాన్నిచ్చే ఒక మాట చెప్పడానికి.. నామీద నాకు గౌరవం నిలుపుకోవడానికి.. ప్రాణాలు కోల్పోతే మాత్రమేం! అనిపించింది.

నేనలా అనగానే వాళ్ళ మొహాల్లో నవ్వు ఎగిరిపోయింది. అందరిలోకీ చిన్నగా వున్న అతను జేబులోనుంచి మెరుపులా యాసిడ్ సీసా తీశాడు. కానీ అది

యాసిడ్ సీసా అని నాకు అర్థం కాలేదు. అనుకున్నది ధైర్యంగా చెప్పగలుగుతున్నానన్న ఆనందం మనసును వూపేస్తుంటే.. గట్టిగా వూపిరి తీసుకుని మరోసారి చెప్పాను.

"అవును. ఒకవేళ నాకు ఆన్సర్స్ తెలిసినా నేను వ్రాయను." అని.

అంతే. అతను సీసా నామీదకి విదిలించాడు. ప్రక్కనున్న అతను విసురుగా లాగేయడంతో నాతోపాటూ అతని చేతిమీద కూడా యాసిడ్ పడింది.

మేమిద్దరం బాధతో అరుస్తుంటే మిగిలిన వాళ్ళందరూ గబగబా తలుపులు తీసి మమ్మల్ని బయటకి తీసుకువచ్చారు." మెరుస్తున్న కళ్ళతో చెప్పింది మృదుల.

ఆమె మాటలు వింటుంటే నాకళ్ళు చెమర్చాయి.

కాళ్ళకి దండం పెడదామనిపించింది.. కానీ పెద్దవాడినయిపోయాను.

శిరసును ముద్దాడాలనిపించింది.. కానీ మగవాడినయిపోయాను.

మెచ్చుకుంటూ ఒక మంచి మాట చెప్పాలనిపించింది.. కానీ.. కానీ హటాత్తుగా నేను "మూగవాడిని" అయిపోయాను.

*****

("పల్లకి" విమాత్న వారపత్రిక - 08.12.1993)